

కథా కౌముది

# అనురాగ్

డా. పేరం ఇందిరా దేవి

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తోంది. ఊరు వాడా అదే గోల. ప్రభుత్వ ప్రచారసాధనాల్లో, టీవీల్లో, ఫోన్ లో, వాట్సాప్ లో కరోనా భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించే. అపార్ట్మెంట్ లో ఒక ఇంట్లో వ్యక్తికి కరోనా సోకిందని ఆ ఇంటివారందరినీ క్వారంటైన్ కి తీసికెళ్ళారు. మిగతా ఇళ్లలోని వారిని కూడా అత్యవసరమైతే తప్ప బయటకు రానివ్వడంలేదు. బయట ఒక పోలీస్ ను కాపలాగా కూడా పెట్టారు. ఏదైనా కావాల్సిన వారు ఆయనకు ఫోన్చేస్తే ఆయన తెచ్చిఇచ్చేవాడు. ఎవరూ బయట కనపడటంలేదు. దిగ్బంధం అంటే ఇదేనేమో. ఎప్పుడూ పిల్లల ఆటలతో, పెద్దల హడావుడి కదలికలతో  ముసలివాళ్ల సమావేశాలతో కళకళ లాడే ఈ అపార్ట్మెంట్ నిశ్శబ్దానికి నిలయమైంది. ఆఫీసులు, బళ్ళు, కళాశాలలు ఏవీ నడవడంలేదు కాబట్టి అందరు ఇళ్లలో బందీలయ్యారు.

బయటికి వెళ్లలేని నా నిస్సహాయతలో నాకున్న ఒకే ఒక ఆనందం కిటికీ. టీవీ, పుస్తకాలు, సెల్ఫోన్ ఇవి మూడూ విసుగు కలిగించినప్పుడు బాహ్య ప్రపంచం ఉనికిని తెలిపేది కిటికీ. ఒక గది కిటికీలో నుండి చూస్తే దూరాన వున్న జగన్నాథగట్టు, కొండచుట్టూ వున్న పచ్చదనం ఆహ్లాదంగా ఉంటుంది. మరొక గదిలో నా కిటికీకి ఎదురుగా పక్కింటి వాళ్ళ కిటికీ ఉంటుంది. అన్ని ఇళ్ళ తలుపులు ఎప్పుడూ మూసుకుని ఉంటాయి. ఎప్పుడైనా ఏ ఇంటి తలుపైనా తెరుచుకున్న మరుక్షణంలోనే దుమ్ము రేగినప్పుడు అదిరిపడ్డ కంటి రెప్పలా అవి వెంటనే మూసుకు పోతాయి. పక్కింటి కిటికీ గుండా నా లాగే బయటి ప్రపంచాన్ని చూస్తుంటాడు రెండేళ్ళ బాబు. నిప్పులవలయం మధ్యలో చిక్కుకున్న లేడి పిల్లలా ఆ చిన్నారి ముఖంలో బేలతనం, ఆ లేడి కళ్లలాగే వున్న తెల్లటి కళ్ళలో నల్లటి కనుపాప బిత్తర పోయి చూస్తుంటుంది. ఎప్పుడూ కిటికీ చువ్వలు పట్టుకుని వాడు ఖైదీని తలపిస్తుంటాడు.

అప్పుడప్పుడు కోపంగా కిటికీ ఇనుప చువ్వల్ని చిన్నారి చేతుల్తో విరిచివేయడానికి విశ్వప్రయత్నం చేస్తుంటాడు. ఆకాశంలో ఎగిరే పక్షుల్ని, కదులుతున్న మేఘాల్ని పిలుస్తుంటాడు. ఏ భాషా కాని భాషలో మాట్లాడుతుంటాడు. వాళ్ళమ్మ వాడికి అక్కడే అన్నం తినిపిస్తుంది. నేనెప్పుడు ఆ కిటికీ పక్కకి వెళ్లినా ఆ బుజ్జాయి అక్కడే ఉంటాడు. వాడ్ని చూసినప్పుడల్లా గాఢంగా హత్తుకోవాలనిపిస్తుంది. ఆ చిన్నారి అమాయక ముఖంలోకి తదేకంగా చూడాలనిపిస్తుంది. వచ్చిరాని వాడి ముద్దు మాటలు వినాలనిపిస్తుంది.

ఈ ఇంటిని కొని అయిదేళ్ల క్రితం నేను వచ్చినప్పుడే పక్కఇంటిని కొని, దంపతులు ప్రసాద్, జయ, వాళ్ళ అబ్బాయి జయంత్, అమ్మాయి జాన్వీ చేరారు. ఇంట్లో చేరిన నెలకే అమ్మాయికి పెళ్లిచేశారు. బయటివారు మరీ ఎక్కువ రాలేదు కానీ అపార్ట్మెంట్ లోని వారందర్నీ ఆహ్వానించి, ఎంతోఆత్మీయంగా పలకరించి అందరి ప్రశంశలు పొందారు. తర్వాత కొద్దీకాలానికే కొడుక్కి పెళ్లి చేశారు. ఈసారి కూడా తక్కువ సంఖ్యలో బయటి అతిధులు, అపార్ట్మెంట్ వారందరం హాజరయ్యాము. కొడుకు, కోడలు హైదరాబాదులో వుంటారు, కూతురు అమెరికాలో వుంటుంది. కూతురు కోసం ప్రసాద్, జయ ఆరు నెలలు అమెరికాలో వుంటారు, ఆరునెలలు ఇక్కడ వుంటారు. మధ్యలో కొడుకు, కోడలు వస్తుంటారు. ఎంతో సంతోషంగా వుంటారు కుటుంబ సభ్యులందరు. జయ, ప్రసాద్ అందరితో కలిసిపోతారు...ఎవరికీ ఏ సహాయం చేయడానికైనా వెంటనే ముందుకొస్తారు. వాళ్ళు అమెరికా పోయినప్పుడు నాకు చాలా ఒంటరిగా అనిపిస్తుంది. మిగతా ఇళ్లవాళ్లు అసలు బయటికి రారు. జయ ఒక్కతే బాగా దగ్గరైంది నాకు. వాళ్ళుఎప్పుడొస్తారా అని నేను ఎదురుచూస్తున్నప్పుడు కరోనా వచ్చింది

"ఇంక ఎప్పుడొస్తామో ఏమో...మాక్కూడా విసుగ్గావుంది ఇంట్లోనే ఉండడం... విమానాలు తిరగ్గానే వచ్చేస్తాం" అంది జయ.

పక్కింట్లో పనమ్మాయి శుభ్రం చేస్తుంటే జయ ప్రసాద్ వస్తున్నారేమోనని అతృతగా ఫోన్చేశా.

"మేం రావడంలేదు, కరోనా వలన జయంత్ కు స్నేహాకు ఆఫీస్ కు వెళ్లాల్సిన అవసరం లేదట...ఇంట్లోంచే పని చేయొచ్చుట హైదరాబాద్ లో ఉండడం దేనికి అని మనింటికి వస్తున్నారు ... కోడలికి ఏదైనా అవసరం వస్తే నిన్ను అడగమని చెప్పా ... బాబుతో ఒక్కతీ చేసుకోలేదు ఆఫీస్ పని కూడా ఉంటుంది కదా. కొంచం చూస్తూ వుండు" అంది.
వాళ్ళు వచ్చిన రోజు నుండి బయటకే రాలేదు...నేను వెళ్లి పలకరిద్దామా అనుకునే లోపల అందరం ఇళ్లకు బంధీలమయాం. జయ కొడుకు కోడలు నాకు పెద్దగా పరిచయం లేదు కానీ బాల్కనీ నుండి రెండు మూడు సార్లు పలకరించా... ఏమైనా అవసరమైతే అడగమని, తలూపింది కానీ ఎప్పుడూ ఏమీ అడగలేదు. నేను కిటికీ దగ్గర వున్నప్పుడు పలకరింపుగా నవ్వుతుంది స్నేహ, అంతే.

ఆ చిన్నారి పేరు అనురాగ్ అట జయ చెప్పింది. ఆ కిటికీ దగ్గరకు నాకు తెలియకుండానే నేను వెళుతుంటాను--- వాడ్ని చూడ్డానికి ఎప్పుడెప్పుడు ఎనిమిదవుతుందా అని చూస్తుంటాను...వాళ్ళమ్మ వాడ్ని ఎనిమిదికి బాగా ముస్తాబు చేసి కిటికీకి వాడ్ని అతికించి పాలుత్రాపిస్తుంది...తొమ్మిదికి టిఫిన్ తినిపిస్తుంది. ఇంక పక్కనే కూర్చుని తనలాప్టాప్ ముందేసుకుని పనిచేసుకుంటుంది.

రోజూ ఇదే. కార్యక్రమం... అనురాగ్ ని చూడటం నాకు ముఖ్యమైన దినచర్య గా మారింది --- మా అబ్బాయిలతో మాట్లాడినా, ఇంకెవరితో మాట్లాడినా అనురాగ్ చర్చవచ్చేది. అనురాగ్ ను చూస్తుంటే నా కొడుకుల చిన్నప్పటి మధురజ్ఞాపకాలు గుర్తుకొచ్చి...పిల్లలు పెద్దవకుండా అలాగే ఉంటే ఎంత బావుండేది! ఎందుకుపెద్దగవుతారా? ఎందుకు దూరమవుతారా అనిపిస్తుంది. మళ్ళీ ఎప్పుడెప్పుడు పిల్లలు పెద్దగవుతారా అని తలుచుకున్న రోజుల్ని గుర్తు చేసుకుని నవ్వుకుంటాను. మనిషి నైజం ఇది. వున్నప్పుడు దేని విలువ తెలియదు.... లేనప్పుడు ఎంత కోరుకున్నా దొరకదు. నా కొడుకులు కూడా జయంత్ వయసువాళ్ళే. వాళ్లకు పెళ్లి ఆలోచనేలేదు. లేకపోతే నాకు అనురాగ్ లాంటి ముద్దులొలికే చిన్నారి మనుమడో, మనుమరాలో ఉండేది. ప్చ్ ఎంచేస్తాం? ప్రస్తుతానికి వున్న ఆశీర్వాదం అనురాగ్ ను చూడ్డమే.... ఎడారిలాంటి ఒంటరితనంలో...మనల్ని మనమే బంధించుకున్న బందిఖానాలో--- అనురాగ్ గొప్ప అదృష్టం...అనుకుంటాను. ఈ బందిఖానా ఇంకెన్నాళ్లో...! ఆ తర్వాత పక్కిల్లేగా వెళ్లివాడ్ని చూడొచ్చు, ఎత్తుకోవచ్చు. రోజూ నన్ను చూసి నవ్వుతాడు. సంతోషంతో కేకలేస్తాడు...రమ్మని సైగచేస్తాడు, దా...దా అంటూ పిలుస్తాడు కాబట్టి నా దగ్గరికి వస్తాడు--- ఆవిధంగా నా మనసు లో అనురాగ్ పై ఆశలు మొదలయ్యాయి. పుస్తకం చదువుకుంటూ మధ్యలో వాడు కిటికీ దగ్గరున్నాడేమో అని చూసి రావడం. ప్రైమ్ లో సినిమా చూస్తూ--- మధ్యలో ఆపి వాడి కోసం కిటికీ దగ్గరకు వెళ్లడం, వాడు అక్కడ లేకపోతే నిరాశగా అనిపించడం, వాడు కనపడితే చాలు మనసు తృప్తిగా సంతోషంగా అనిపించడం ఇవన్నీ నా లాంటి ధృడమైన వ్యకిత్వం కలిగిన స్త్రీకి వుండొచ్చునా? ఇది బలహీనతనా? నాలో నేను తర్కించుకున్నా...కానీ నాకు సరైన సమాధానం తోచలేదు. ఏ విషయం అయినా శాంతి, సంతోషం కలిగించేది ఉన్నతమైందే దాన్ని అందుకోవడంలో బలహీనత ఏముంది? నన్ను నేను సమాధానపరుచుకోవడానికి ప్రయత్నించాను.

అర్ధరాత్రి రెండు గంటలకు జయ ఫోన్.... "ఓహ్ నిద్రపోతుంటావుకదా! లేపక తప్పలేదు---

స్నేహ నాన్న గారికి చాలా బాగాలేదట...ఆయనకు ఒకసారి గుండెనొప్పి వస్తే ఏదో చేశారు నాకు సరిగ్గా తెలియదు...వాళ్ళు వెంటనే హైదరాబాద్ అపోలో కు పోవాలి, అక్కడికి అనురాగ్ ను రానివ్వరట, పైగా కరోనా వుంది కదా --- వాడ్ని ఎక్కడని వదులుతారు? స్నేహ బంధువులు వచ్చి రేపు అనురాగ్ ను తీసికెళతారు...అంతవరకు అనురాగ్ ను మీ దగ్గరుంచుకుంటారా? వాడేమీ మీకు ఇబ్బంది పెట్టడు. హైద్రాబాద్ లో ఉండగా వాడికి అలవాటే---"

నిద్రమత్తు వదిలింది.

"ఇందులో నాకు ఇబ్బంది ఏమిటి జయా! వాడు నా దగ్గర ఇబ్బంది పడకుండా ఉంటే...ఎన్నిరోజులైనా నాకేమీ కష్టంకాదు...పైగా చాలా సంతోషం కూడాను...స్నేహను బాబుకు ఏమివ్వాలో అవన్నీ చెప్పి వదిలి వెళ్ళమని చెప్పు." జయకు హామీ ఇచ్చాను

స్నేహ, జయంత్ చాలా జాగ్రత్తలు చెప్పి వాడి, బట్టలు, అవసరమైన మందులు, అన్నీ ఇచ్చారు.

"మీరు తిరిగి వచ్చేవరకు అనురాగ్ నాతోనే ఉంటాడు, ఎవరి దగ్గరికీ వాడ్ని పంపవలసిన అవసరం లేదు. నిశ్చింతగా వుండు స్నేహా...నాన్నగారి కెలా వుందో ఫోన్చెయ్యి. అంతా మంచిగా జరుగుతుందిలే... దిగులుపడకు" అన్నాను.

కన్నీళ్లు నింపుకుని నిద్రపోతున్న అనురాగ్ ను నా మంచం మీద పడుకోబెట్టి. ముద్దుపెట్టుకుని వాడ్ని వదలలేక నిలబడిపోయింది. "అమ్మా ఏమైనా ఇబ్బంది పెడితే చెప్పండి...విధిలేని పరిస్థితిలో మీకు శ్రమ కలిగిస్తున్నాము" అన్నాడు జయంత్

"లేదు...జయంత్ మీ అమ్మ దగ్గర వదలడానికి బాధపడతారా, ఇబ్బంది పడతారా? లేదుకదా! అలాగే అనుకోండి. అనురాగ్ ను నా దగ్గరుంచుకోవడం నాకు చాలా ఆనందం. సరేనా! వెళ్లి మామగారిని చూసుకోండి. రోజూ ఫోన్లో అనురాగ్ విషయాలు మాట్లాడుకోవచ్చు."

కలా. నిజమా...అర్థంకాలేదు కాసేపు. ఏదైనా మనసులో తీవ్రంగా కోరుకుంటే జరుగుతుందేమో ...! అనురాగ్ తలపై చేయివేసి వాడి నుదుటిపై పడ్డ జుట్టును సవరిస్తుంటే...మనసంతా హాయి నిండింది. అమాయకత్వం నిండిన నిష్కల్మషమైన పసిపిల్లలే లేకపోతే ఈ ప్రపంచంలో ఆనందం ఏముంది?

COMMENTS